## తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి రాగానే తీజ్ పండుగను

# అధికారికంగా నిర్వహిస్తాం: కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం,హైదరాబాద్ సింగరేణి కాలనీ: తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి రాగానే తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని, బంజారా ఆడబిడ్డలు కోరుతున్నట్లుగా ఈ పండుగకు మూడు రోజుల పాటు అధికారిక సెలవులు ప్రకటిస్తామని ఆ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన తీజ్ వేడుకల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నది ఆడబిడ్డలేనని కొనియాడారు. తొమ్మిది రోజుల పాటు కఠిన ఉపవాసాలు ఉంటూ, నేలపై నిద్రిస్తూ మన సంప్రదాయాలను కాపాడుతున్న తీజ్ పండుగ ప్రాశస్త్యాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. సింగరేణి కాలనీలో గత 30 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాల్వలు, గుడిసెలు అలాగే ఉన్నాయని, ప్రజల జీవితాల్లో ఏమాత్రం మార్పు రాలేదని విమర్శించారు. ఈ దుస్థితి మారాలనే ఉద్దేశంతోనే 'సామాజిక న్యాయ సంకల్పం' తీసుకున్నామని, ఇందులో భాగంగానే ఆగస్ట్ 6న హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహించి మార్పు దిశగా అడుగులు వేశామని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలని, వారి సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బంజారా సోదరీసోదరులతో తెలంగాణ రక్షణ సేనకు ఉన్న ప్రేమానుబంధాలను గుర్తుచేశారు. భారీ వర్షం పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా ప్రజలు సభలో నిలబడటాన్ని చూస్తుంటే వారి ధైర్యం, పట్టుదల, తమ సంస్కృతి పట్ల ఉన్న గౌరవం స్పష్టమవుతున్నాయని తెలిపారు. సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ సాధన ఒక్క తెలంగాణ రక్షణ సేనతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు.



## శ్రావణ మాసం సందర్భంగా

## అత్తాపూర్ లో వైభవంగా 'కావడి యాత్ర'



ఇది కద నిజం,అత్తాపూర్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అంబియన్స్ ఫోర్ట్ కాలనీ నుంచి పరమశివుని భక్తులు పవిత్రమైన 'కావడి యాత్ర'ను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గంగా జలాన్ని సేకరించి, రామబాగ్ లోని ప్రముఖ శ్రీ చిన్న అనంతగిరి శివాలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి పవిత్ర గంగా జలంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పవిత్ర యాత్రలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం రామేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి సాబాద విజయ్ కుమార్ తో పాటు ప్రముఖ నాయకులు ఎస్.బి. హరినాథ్, అరవింద్ అగర్వాల్, గణేష్ గుప్త, దీపక్, ధర్మేంద్ర అగర్వాల్, ఓం ప్రకాష్, పంకజ్ అగర్వాల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరమశివుని నామస్మరణతో యాత్ర సాగిన ప్రాంతమంతా శివమయంగా మారింది. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ నాయకులు, నిర్వాహకులు శ్రావణ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహాన్స్ఆర్య తొట్టెల కార్యక్రమంలో పాల్గొని

## ఆశీర్వదించిన పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మద్నూర్: కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కుడిచిర గ్రామంలో కుమ్మరి బాలేశం,పెంటవ్వ దంపతుల కుమారుడు పరమేష్, శైలజ దంపతుల పుత్రుడు మహర్షి తొట్టెల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ హాజరై బాలుడు మహర్షిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే భరోసా



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా పిట్లం గ్రామానికి చెందిన రాజు సెట్ రోడ్డు ప్రమాదానికి గురై స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వెంటనే పిట్లం చేరుకుని రాజు సెట్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రామ్ రెడ్డి, పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యంతోనే సమాజంలో గుణాత్మక మార్పు

### -- ప్రతి వ్యక్తి బాధ్యతగా పనిచేసే విధానం రావాలి



ఇది కద నిజం,చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా: గ్రామ స్వరాజ్య మహా సంకల్ప బైక్ యాత్ర ప్రచారంలో భాగంగా జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ యాదగిరితో పాటు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లతో ఆయన గ్రామ స్వరాజ్యం, సమాజంలో మార్పు, ప్రజల బాధ్యత, యువత పాత్ర తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ యాదగిరి మాట్లాడుతూ సమాజంలో గుణాత్మక మార్పు రావాలంటే ప్రతి వ్యక్తిలో బాధ్యతా భావం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ పనిచేసే విధానం ఏర్పడితేనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలు, అధికారులు, యువత, వివిధ వర్గాల వారు తమ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడే సమాజంలో సానుకూలమైన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యం అనేది కేవలం గ్రామాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి గ్రామం తన సమస్యలను తానే గుర్తించి, తన అభివృద్ధిలో తానే భాగస్వామిగా మారే ప్రజా ఉద్యమం అని కాసాని శ్రీనివాసరావు గౌడ వివరించారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగి, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యావంతులు, ఉద్యోగులు అందరూ తమ గ్రామ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించినప్పుడే నిజమైన స్వరాజ్యం సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుతం గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గడం, వ్యవసాయం ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా--వైద్య రంగాల్లో గ్రామీణ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం గ్రామాల పునర్నిర్మాణంతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. "గ్రామం బాగుంటే కుటుంబం బాగుంటుంది.. కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుంది.. సమాజం బాగుంటే దేశం బాగుంటుంది" అనే ఆలోచనతో గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని ముందుకు తీసుకెళు_న్నామని కాసాని తెలిపారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతతో పాటు సామాజిక క్రమశిక్షణ, చట్టంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించడం, చట్టాలను గౌరవించడం, ఇతరుల హక్కులను గౌరవించడం వంటి విలువలు పెంపొందితే నేరాలు తగ్గి ప్రశాంతమైన సామాజిక వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య మహా సంకల్ప బైక్ యాత్ర ద్వారా తెలంగాణలోని ప్రతి గ్రామానికి వెళ్లి "నా గ్రామం -- నా పాలన, నా బాధ్యత" అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో గ్రామ స్వరాజ్య ఉద్యమ లక్ష్యాలు, భవిష్యత్ కార్యక్రమాలపై సానుకూలమైన చర్చ జరిగినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమ బృందంలో జై స్వరాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, రామిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభ

### విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి

### : సామిడి వంశీ వర్ధన్ రెడ్డి



ఇది కద నిజం ,రాజేంద్రనగర్: ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభను రాజేంద్రనగర్ సీపీఐ పార్టీ కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్ లో పార్టీ మండల కార్యదర్శి, మాజీ యువజన సంఘం నాయకులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి గారు హాజరయ్యారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సామిడి వంశీ వర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్‌కు దేశవ్యాప్తంగా గొప్ప పోరాట చరిత్ర ఉందని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యా రంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వాలు విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థులపై పెరుగుతున్న ఫీజుల భారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోకుండా, విద్యార్థి సంఘాలతో చర్చించి విధానాలను రూపొందించాలని అన్నారు. విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని, విద్యా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తామని సామిడి వంశీ వర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ఉచిత నాణ్యమైన విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

మహాసభలో రాజేంద్రనగర్ మండల పరిధిలోని విద్యార్థుల సమస్యలు, ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ కార్యాచరణ, విద్యార్థులను ఉద్యమాల్లో మరింత భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం

ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి. శివ సాయి రామ్, అధ్యక్షురాలిగా కె. ప్రత్యూష, సహాయ కార్యదర్శులుగా జే . సాయి తేజ, డి. లక్ష్మీనారాయణ దత్తు, ఉపాధ్యక్షులుగా జే రుత్విక్, ఎం. సాయి తేజ రావు, జి. నరోత్తం, సంయుక్త కార్యదర్శిగా డి. ప్రవీణ్ కుమార్ తో పాటు మరికొంత మందిని నూతన మండల కౌన్సిల్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రాజేంద్రనగర్ మండలంలో ఏఐఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మహాసభ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ భారత జాతీయ మహిళా సమాఖ్య Nfiw రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కన్నగారి లక్ష్మి సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్ మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం సిపిఐ మండల శాఖ కార్యదర్శులు జె సదానంద్ గౌడ్ కే వాణి శ్రీరాములు సాబీరు Aituc మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి సలీం సయ్యద్ కాజా ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు యువత నడుం బిగించాలి: AIYF నాయకులు



ఇది కద నిజం ,రాజేంద్రనగర్, ఆగస్ట్ 23: దేశంలో కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విధానాలపై భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని A.R. దేవరాజు భవన్‌లో AIYF రాజేంద్రనగర్ మండల సమితి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. సీపీఐ పార్టీ మండల కార్యదర్శి, మాజీ యువజన సంఘం నాయకులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి AIYF రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చీ. శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి P. శివకుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ కొద్దిమంది వద్ద సంపద పెరగడం దేశ అభివృద్ధి కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత మరియు రాజ్యాంగ విలువలు అందడమే నిజమైన అభివృద్ధని ఉద్ఘాటించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య మరియు వైద్యాన్ని ఉచితంగా అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ప్రజలు ప్రశ్నిస్తే అణచివేయడం కాకుండా వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్యమని, కానీ నేటి పాలకులు కార్పొరేట్ లాభాల కోసం ప్రజా ప్రయోజనాలను పక్కనబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆగస్ట్ 29న జరిగే రంగారెడ్డి జిల్లా మహాసభలు, అలాగే సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగే AIYF తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి, విద్య, వైద్యం, ప్రజాస్వామ్య హక్కులు, యువజన సమస్యలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ మండల AIYF నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నవీన్, కార్యదర్శిగా ప్రభాకర్ తో పాటు ఆఫీస్ బేరర్లుగా రాహుల్, శ్రీ సాయి గౌడ్, తరుణ్, పవన్ గౌడ్, సాయి రిత్విక్ రెడ్డి, కార్తీక్, నవీన్, సౌరభ్, మహేందర్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, NFIW రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నగారి లక్ష్మి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జె. విజయ్ ఆనంద్ గౌడ్, మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, సీపీఐ మండల శాఖ కార్యదర్శులు జె. సదానంద్ గౌడ్, కే. వాణి శ్రీరాములు, సాబీరు, AITUC మండల నాయకులు ఎండి సలీం, సయ్యద్ కాజా, ఈ. శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

